

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,310
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,297
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,500
రిటైల్ వెండి గ్రాము	రూ.71.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	19
చిత్తూరు	33	18
తిరుమల	29	15
గూడూరు	34	20
నగరి	34	19



క్షీరాభిషేకం

ఆలయాల పాలక మండలిలో చోటు కల్పించడంపై నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం తిరుపతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. – తిరుపతి కల్చరల్

న్యూస్‌రీల్

పల్లికొండేశ్వరునికి మహాభిషేకం



స్వామి,అమ్మవార్లకు పూజలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీపల్లికొండేశ్వరాలయంలో మహాభిషేకం పూజలు మంగళవారం వేడుకగా జరిగాయి. ఆలయానికి మహా కుంభాభిషేకం చేసి 4 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ క్రతువు నిర్వహించినట్లు దేవస్థానం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. ఉదయం 7.30 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభమై ఏకాదశ రుద్ర పారాయణం, మూలమంత్రహోమం, రుద్రహోమాలు నిర్వహించారు. 11.30 గంటలకు మూలవిరాట్ స్వయంభు శ్రీవాల్మీకేశ్వరస్వామి, శ్రీమరగదాంబిగ అమ్మవార్లకు మహా అభిషేకానంతరం మహాపూర్ణాహుతి, మహా దేవారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాల పద్మనాభం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీ సలహాదారు బాధ్యతల స్వీకారం



శ్రీవారిని దర్శించుకున్న నాగ దుర్గారావు

తిరుమల: టీటీడీ ఎస్వీబీసీ సలహాదారుడిగా నాగ దుర్గారావు మంగళవారం తిరుపతిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఉదయం నైవేద్య విరామ సమయంలో తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ అధికారులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుపతిలోని ఎస్వీబీసీ కార్యాలయంలో సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఆదేశించారు. బుధవారం నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించాలని తెలిపారు. 14న దరఖాస్తుల పరిశీలన, 15వ తేదీన కమిటీ నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

కోట: పదో తరగతిలో నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికబద్ధంగా బోధన సాగాలని విద్యాశాఖాధికారులకు స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు సూచించారు. మంగళవారం కోట ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలతో ఆర్‌జేడీ సమావేశం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధతపై సూచనలు ఇచ్చారు. టీచర్ల లెసన్ ప్లానింగ్, బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు దిశా నిర్దేశం, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు సైతం ఆన్‌లైన్‌లో నమోదుపై ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డిప్యూటీ డీఈఓ గూడూరు శివప్రసాద్‌రెడ్డి, కోట, వాకాడు ఎంఈఓలు సునీల్, బాబు పాల్గొన్నారు.

ఎనీవేర్.. డోంట్ కేర్

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారుల కాసుల కక్కుర్తికి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం సేవలను సులభతరం చేసేందుకు తీసుకొచ్చిన 'ఎనీవేర్' విధానానికి తూట్లు పడుతున్నాయి. అధిక మొత్తంలో కాసులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసినా... అప్రూవల్ చేయాల్సిన అధికారి నిలిపివేస్తున్నారు. స్కాన్ కాపీ సరిగా లేదని, మార్కెట్ విలువ తక్కువ ఉందని ఏదో ఆశిస్తూ తిరస్కరిస్తున్నట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారుల దందా
- ఎనీవేర్ పేరుతో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న ప్రభుత్వం
- కాసుల కోసం కొర్రీలు పెట్టి పెండింగ్ పెడుతున్న వైనం
- అ'ధనం'గా చెల్లించిన వారి భూములు, స్థలాలకు మాత్రం రిజిస్ట్రేషన్
- కమర్షియల్ స్థలాలను సాగు భూముల కింద చూపించి వసూళ్లు
- పక్కన రోడ్డు, వెంచర్లు ఉన్నాయంటూ రిజిస్ట్రేషన్ చేయని అధికారులు

- తిరుపతిలో నివాసం ఉంటున్న వ్యక్తికి నంద్యాల జిల్లా ఓర్వకల్లుల్లో స్థిరాస్తి ఉంది. ఆ స్థిరాస్తిని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. డాక్యుమెంట్ ఐడీ నంబర్ 1-344-2023-1 కాపీని స్కాన్ చేసి నంద్యాల జిల్లా ఓర్వకల్లు పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా పంపారు. ఆ కాపీలో వివరాలు సరిగా లేవు 'రిజెక్ట్' అని తిప్పి పంపారు.
- తిరుపతి రూరల్‌లో ఉన్న ఒక వ్యక్తి తన స్థిరాస్తిని తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. డాక్యుమెంట్ ఐడీ నంబర్ 1-261-2023-1 రిజిస్ట్రేషన్ కాపీని ఆన్‌లైన్ ద్వారా రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపారు. స్కాన్ కాపీలో వివరాలు సరిగా కనిపించడం లేదంటూ తిరస్కరించారు. మరోసారి ప్రయత్నం చేసినా..అదే సమాధానం.
- భారతి అనే మహిళ నుంచి విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి అర్ధ ఎకరా వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఇది కమర్షియల్ ల్యాండ్ అని సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. ఇదే సర్వే నంబర్‌లో మరో అర్ధ ఎకరం భూమిని అదే సబ్ రిజిస్ట్రార్ వ్యవసాయ భూమి కింద రిజిస్ట్రేషన్‌చేసి ఇచ్చారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'ఎనీ వేర్' అనే విధానానికి నిబంధనల సాకుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారులు ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి రకరకాల కొర్రీలు పెట్టి భూములు, స్థలాలు, తాకట్టు, బదిలీ రిజిస్ట్రేషన్లను పక్కనపెడుతున్నారు. కాసులు ముట్టజెబితే పక్కన పెట్టిన వాటిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. స్థిరాస్తులు ఎక్కడ ఉన్నా.. తనకు అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం సేవలను సులభతరం చేసింది. 'ఎనీ వేర్' అనే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ విధానంతో ప్రజలకు సమయం, ప్రయాణం ఖర్చులు ఆదా అవుతుంది. దీన్ని మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామ సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఆ భూముల రిజిస్ట్రేషన్‌పై విచారణ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు 189 ఎకరాల కమర్షియల్ భూములను సాగు భూముల కింద రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని మాత్రం అధికారులు జేబులు నింపుకున్నారు. ఈ విషయమై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్పందించిన ప్రభుత్వ ఉన్నతాధికారులు సంబంధిత రిజిస్ట్రార్‌ని వివరణ అడిగారు. తప్పైంది.. మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటానని రాతపూర్వకంగా ఆ అధికారి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఆ భూముల రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు గోప్యంగా విచారణ చేస్తున్నట్లు అమరావతికి చెందిన ఒక అధికారి సమాచారం.

అంతా కుమ్మక్కు?

ప్రభుత్వం ఎనీవేర్ విధానంతో రిజిస్ట్రేషన్లను సులభతరం చేయడం కొందరు అధికారులకు మింగుడుపడడం లేదు. అయితే ఈ విధానాన్ని వ్యతిరేకించలేని పరిస్థితి. దాంతో కొందరు సబ్ రిజిస్ట్రార్లు తిరుపతిలో రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్కడైనా స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు వస్తే చేయాలని, అయితే ఆ దస్తావేజు రిజిస్ట్రేషన్ అప్రూవల్ కాకుండా పెండింగ్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలా పెండింగ్ పెట్టి ఒకటికి నాలు పర్యాయాలు తిప్పుకుంటే... వారే దారిలోకి వస్తారని చర్చ జరిగినట్లు సమాచారం. ఆ తరువాత నగదు డిమాండ్ చేసి తీసుకుని ఎవరి వాటా వారు పంచుకుందామని నిర్ణయించి, ఇలా చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

> **ఎనీవేర్‌కు అందరూ సహకరించాలి**
>
> ప్రభుత్వం తీసుకొచ్చిన ఎనీవేర్ విధానాన్ని అందరూ అమలు చేయాల్సిందే. ప్రజలకు సహకరించాలి. అలా ఎక్కడైనా చేయకపోతే తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.
>
> **-గిరిబాబు, డీఐజీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా**

జీఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



జీఎన్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం : గ్రామీణుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన ఐఆర్ఆర్ఎం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జీఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. మంగళవారం పట్టణంలోని వైఎస్ జేమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రాంగణంలో జీఎన్ రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 60 దేశాల్లో సామాజిక సేవలందించిన జీఎన్ రెడ్డి జిల్లాలోని పులిచెర్లలో జన్మించడం గర్వకారణమన్నారు. వెనుకబడిన ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో ప్రజల స్థితిగతులను మెరుగుపరిచేందుకు విజలాపురంలో 1979వ సంవత్సరం ఐఆర్ఆర్ఎం స్వచ్ఛంద సంస్థను స్థాపించారని తెలిపారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని, ఎందరో పేదల ఆర్థికాభివృద్ధికి సాయం చేశారని పేర్కొన్నారు. 1965లో తిరుపతి వ్యవసాయ వర్సిటీలో పట్టా పొంది, రైతుల అండగా నిలిచిన దార్శనికుడు జీఎన్ రెడ్డి అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఎలా పనిచేయాలో మార్గనిర్దేశం చేసిన మహనీయుడన్నారు. కుప్పంలో పాలిటెక్నిక్ కళాశాలకు సైతం ఆయనే స్థలం వితరణగా అందించారని గుర్తుచేశారు. అంతటి మహామనీషితో కలిసి పనిచేయకపోయినా, నేడు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిచడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ్, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, వన్నెకు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనిత పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మార్కెట్ కమిటీ పనితీరుకు ప్రశంస

పలమనేరు : పన్ను వసూలు, లక్ష్యాలను అధిగమించడంలో రాయలసీమలోనే ప్రథమ స్థానం దక్కించుకున్న పలమనేరు మార్కెట్ కమిటీకి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్, కార్యదర్శి సంజీవ్‌కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. మంగళవారం కుప్పం పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో శివునికుప్పం మ్యాంగో మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, ఏఎంసీ వైస్ చైర్మన్ పుష్పలత ఆంజనేయులు, ఎంపీపీ యువరాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, పార్టీ కుప్పం పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప, నాయకులు జయరామిరెడ్డి, మండీ సుధా, డైరెక్టర్లు ఎమ్మార్ వేణు, నారాయణరెడ్డి, వీణ, సుబ్రమణ్యం, ఎర్రబెల్లి శ్రీనివాసులు, పర్యవేక్షకులు జ్ఞానాంబ, రత్నమ్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో జాగ్రత్త

తిరుపతి క్రైం : నకిలీ ఆన్‌లైన్ యాప్‌లతో తీసుకునే అప్పు ప్రాణాలకే ముప్పని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు జరిగింది. మహిళా విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ రాజారెడ్డి, రిజిస్ట్రార్ రజనీ, సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఈఎల్ నరసింహరావుతో కలిసి మొబైల్ హంట్ యాప్‌ను ఎస్పీ ప్రారంభించి, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కరపత్రికను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ నకిలీ యాప్‌లలో అప్పులు చేసి, దానిని కట్టలేక ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు ఎవర్ని సంప్రదిస్తే న్యాయం జరుగుతుందో అవగాహన పెంచేందుకు అవగాహన సదస్సులను వారం రోజుల పాటు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, డీఎస్పీలు, పోలీస్ సిబ్బంది, సైబర్ ల్యాబ్ సిబ్బంది ఎంఎస్‌కేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ పోయిందా..

మొబైల్ హంట్ యాప్ సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న వారు 9490617873 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే, వారికి ఒక గూగుల్ అప్లికేషన్ ఫామ్ వస్తుందన్నారు. తగిన వివరాలను నింపి సబ్మిట్ చేస్తే తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు ఆ ఫిర్యాదులను స్వీకరించి, పోయిన మొబైల్‌ను రికవరీ చేస్తారన్నారు.సైబర్ పోలీసులు మూడు నెలల్లో రూ.44 లక్షల విలువజేసే 225 మొబైల్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారన్నారు.



మొబైల్ హంట్ యాప్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, వైస్ చాన్స్‌లర్ రాజారెడ్డి

సమర్థవంతంగా క్యాన్సర్ స్క్రీనింగ్

తిరుపతి అర్బన్: క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, ప్రథమ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేలా పరీక్షలుండాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపై స్విమ్స్, స్వికార్, ఆయుర్వేదిక్ ఆస్పత్రుల డాక్టర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనాభాలో 10 శాతం మందికి క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 2021లో 10 వేల మందికి పరీక్షలు చేస్తే 44 కేసులు, 2022లో 13 వేల మందికి పరీక్షలు చేస్తే 65 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మహిళలు 67 శాతంగా ఉన్నారని...అధికంగా 45 వయస్సు పైబడిన వారు క్యాన్సర్ బారిన పడుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నివారణ, వైద్య చికిత్సలకు ప్రత్యేక ప్రాధాన్యతలు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. జిల్లాలో 691 సచివాలయాల పరిధిలోని 2వేలకు పైగా వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆ మేరకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాలని చెప్పారు. కొత్తగా స్విమ్స్‌లో కేర్ ట్రాకర్ యాప్ ప్రారంభించామని, చికిత్స సమయంలో ఉపయోగ పడుతుందని, ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలో స్విమ్స్, టాటా ఆస్పత్రులకు పింక్‌బస్‌లు ఉన్నాయని, మరో రెండు బస్సులు ప్రభుత్వాన్ని కోరనున్నామని వెల్లడించారు. ఒక్కొక్క బస్సులో 120 మందికి స్క్రీనింగ్ చేసే అవకాశం ఉన్నందున, జిల్లాలో పూర్తిస్థాయిలో స్క్రీనింగ్ నిర్వహించి కేసులను గుర్తించాలని, చికిత్సలు అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. డీబీఆర్ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీలో ఆంకాలజీ ఉందని, వారి సేవలు ఉపయోగించుకోవాలని వివరించారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి, స్విమ్స్ డాక్టర్లు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆస్పత్రి డాక్టర్ రేణుదీక్షిత్, ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డాక్టర్ విజయభాస్కర్, స్వికార్ పీవీ హేమంత్, డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రోగుల్లో మనోస్థైర్యాన్ని నింపాలి

- డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి గిల్లిభర్న్

తిరుపతి తుడా : రోగికి మెరుగైన వైద్యంతో పాటు మనోస్థైర్యాన్ని నింపేందుకు వైద్యులు కృషి చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత ప్రతినిధి, లండన్ రాయల్ మర్సిడెన్ హాస్పిటల్ నర్సింగ్ ఆఫీసర్ గిల్లిభర్న్ పేర్కొన్నారు. స్విమ్స్‌లో మంగళవారం ఫిలాసఫీ ఆఫ్ పాలియేటివ్ కేర్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతదేశ పాలియేటివ్ కేర్ అవసరాల కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమించిన గిల్లిభర్న్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ రోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ చికిత్స అందిస్తే వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి త్వరగా కోలుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. రోగితో పాటు వారి బంధువులకు సౌమ్యంగా అనారోగ్య సమస్యను వివరించే పద్ధతులను వైద్యులు అలవర్చుకోవాలన్నారు. స్విమ్స్‌లో పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ వింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్యాన్సర్ వ్యాధి తీవ్రమైనా రోగికి నొప్పి తగ్గించేందుకు ఈవింగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈవింగ్ తిరుపతి స్విమ్స్‌లో ఏర్పాటు చేశారని అభినందించారు. స్విమ్స్ అధికారులు, వైద్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డాక్టర్లు ప్రాణబంధుదాస్, అలోక్‌సమంత్‌రే, నాగరాజు, శివకుమార్, ముక్తేశ్వరయ్య, సుబ్రమణ్యాన్, శ్రీహరిరావు, మాధవి పాల్గొన్నారు.



గిల్లిభర్న్‌ను సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, వైద్యాధికారులు

పెండింగ్ భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న వినోద్‌కుమార్‌రెడ్డి, గిరిజనులు

కోట: పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజి అధికారులను ఆదేశించారు. జేసీ బాలాజి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం కోట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కోట క్రాస్‌రోడ్డులో ఇటీవల జరిగిన భూముల విక్రయాలకు సంబంధించి అధికారులతో జేసీ చర్చించినట్లు సమాచారం. అదే విధంగా గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. జేసీని దామర్లగుంట గిరిజన కాలనీవాసులు కలిసి కాలనీకి దారి ఏర్పాటు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి గిరిజనులు పడుతున్న ఇబ్బందులను జేసీకి వివరించారు. దీనిపై విచారణ జరిపి కాలనీకి దారి మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ తహసీల్దార్ పద్మావతి, డీటీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాబు ఏమార్చితే.. జగనన్న నెరవేర్చారు!

- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ప్రజలను చంద్రబాబు ఏమార్చితే.. ఇచ్చిన హామీలన్నీ జగనన్న నెరవేర్చారని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నేతలను చీపుర్లతో కొట్టండి అంటూ లోకేష్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల అప్పులు రూ.14600 కోట్లు మాఫీ చేస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి బ్లాక్ లిస్ట్‌లోకి తోసేసిన చంద్రబాబును మహిళలు కొడతారు కానీ, ఆ అప్పు రూ. 24వేల కోట్లకు పెరిగినా మాఫీ సొమ్ము అందిస్తున్న జగనన్నను సహోదరునిగా ఆరాధిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను శిథిలావస్థలోకి నెట్టిన చంద్రబాబును, లోకేష్‌ను పిల్లల తల్లిదండ్రులు కొడతారు కానీ, సర్కారు బడులను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దిన జగనన్నను తమ ఇంటిబిడ్డలా చూసుకుంటారన్నారు. రూ.86,600 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి పంగనామాలు పెట్టిన చంద్రబాబును రైతులు కొడతారు కానీ, వ్యవసాయాన్ని పండుగలా మార్చి, అన్నదాతలను ఆదుకుంటున్న జగనన్నకు అండగా నిలుస్తారని చెప్పారు. ఏటా 5 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏమార్చిన వారికి దెబ్బలు పడతాయా.. 32 లక్షల మందికి పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్న వారికి దెబ్బలు పడతాయా.. తెలుసుకోలేని అవివేకి లోకేష్ అని విమర్శించారు. అరకిలోమీటరు కూడా నడవడం చేతగాక వంకర టింకర్లు పోతున్న లోకేష్, 3,600 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన జగనన్న గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైనాట్ 175 అంటూ సింహంలా వస్తున్న జగనన్న ముందు 175 మందిని పోటీచేయించడానికి కూడా సత్తా లేక సతమతమయ్యే చంద్రబాబు తేలిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

శాస్త్రోక్తం.. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- 11నుంచి శ్రీనివాసమంగాపురంలో బ్రహ్మోత్సవాలు


ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, కుంకుమ, గంధం పొడి, పచ్చాకు, గడ్డ కర్పూరం, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్,సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రెండు పరదాల విరాళం
స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతికి చెందిన పరదాల మణి రెండు పరదాలు, రెండు కరాళాలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు.

మార్చిలోపు శ్రీనివాస సేతు పనులు పూర్తి


శ్రీనివాస సేతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : రేణిగుంట రోడ్డు – తిరుచానూరు మ్యాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాస సేతు వంతెన పనులు మార్చినెలాఖరులోపు పూర్తి చేయా లని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం శ్రీనివాససేతు పనుల పురోగతిపై ఇంజినీరింగ్, అఫ్కాన్స్, ఏఈకామ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రేణిగుంట రోడ్డులోని రామానుజ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువ మంది కార్మికులను నియమించి గడువు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి లోపు రేణిగుంట, తిరుచానూరు రోడ్డులో జరుగుతున్న ర్యాంపు పనులు పూర్తి చేయాలన్నారు. మార్చి నెలాఖరుకు శ్రీనివాససేతు మీద వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యమైతే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిరోజూ పనులను పరిశీలించి పురోగతి సాధించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఎస్ఈ మోహన్, ఎంఈ వస్ చంద్రశేఖర్, డీఈ మోహన్, అఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన
అనంతరం కమిషనర్ తుడా మార్గంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

బాల్య వివాహాల నివారణకు పటిష్ట చర్యలు


కలెక్టర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందిస్తున్న దేవస్థానం చైర్మన్, సభ్యులు

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బాల్య వివాహాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు రమాప్రభ, సునీత, లక్ష్మి ,శ్రీదేవి, పాలమంగళం లీలా తదితరులు బ్రహ్మోత్సవాలకు కుటుంబసభ్యులతో హాజరు కావాలని కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల విజయవంతానికి సమష్టిగా పనిచేయాలని చెప్పారు. ప్రధానంగా కల్యాణోత్సవం రోజున బాల్యవివాహాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మహాశివరాత్రి రోజు తోపులాటలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సామాన్య భక్తులకు సులభ దర్శనం కల్పించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13 నుంచి 26వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఆలయ పరిపాలనా భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకమండలితో కలిసి అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు భక్తులను కట్టిపడేలా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్‌కు డాక్టర్ కృష్ణ ప్రశాంతి



తిరుపతి తుడా: డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ బయోటెక్నాలజీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్‌లో నాన్-అఫీషియల్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ పెన్నా కృష్ణ ప్రశాంతిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ శుభోకుమార్‌రామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఈ పదవిలో మూడేళ్లు ఉంటారు. కీలకమైన బయో టెక్నాలజీ రీసెర్చ్ కౌన్సిల్లో డైరెక్టర్‌గా నియమితులు కావడంపై పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

21 నుంచి తిరుపతి-గుంతకల్ రైలు వేళల్లో మార్పు

తిరుపతి అర్బన్: తిరుపతి – గుంతకల్ ప్యాసింజర్ (07656) రైలు ఈనెల 21వ తేదీ నుంచి తిరుపతిలో ఉదయం 8.10 గంటలకు బయలుదేరనుంది. ఈ మేరకు గుంతకల్ డీఆర్‌ఎం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి నుంచి పాకాల మీదుగా నడుస్తున్న రైలు ద్వారా వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రైలు ఉదయం 8.50 గంటలకు బయలుదేరుతుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ద్వారా గుంతకల్ డీఆర్‌ఎంకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన డీఆర్‌ఎం రైలు బయలుదేరే సమయాన్ని మారుస్తున్నట్టు లేఖ రాశారు. ఈ మారిన వేళలు ఈ నెల 21 నుంచి అమలవుతాయని రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.

క్రీడలు జీవన విధానంలో భాగం కావాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బాలాజీ


తిరుచానూరు:మానసిక ఒత్తిడిని తగ్గించుకుని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు జీవన విధానంలో భాగం కావాలని తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలో మంగళవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది క్రీడలు, వక్తృత్వ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాంకేతిక మార్పులతో ప్రతి ఒక్కరు అనేక శారీరక, మానసిక రుగ్మతులను ఎదుర్కొంటున్నారన్నారు. వీటి పరిష్కారానికి క్రీడలు చక్కటి మార్గమని తెలిపారు. డీన్ డాక్టర్ పి.సాంబశివరావు మాట్లాడుతూ మొదటి సారిగా బోధన, బోధనేతర సిబ్బందికి సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్‌రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఎల్ కుమార్‌రెడ్డి, ఆర్‌పీ.వసంతి, వివిధ కళాశాలల అసోసియేట్ డీన్లు పాల్గొన్నారు.

నారాయణవనం పాఠశాలకు జాతీయ గుర్తింపు


పాఠశాల గ్రీన్ స్కూల్ బృందంతో డీవైఈఓ రఘురామయ్య

నారాయణవనం: నేషనల్ గ్రీన్ కార్ప్స్ సర్వేలో నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఈనెల 21వ తేదీ న్యూఢిల్లీలో పాఠశాలకు అవార్డును ప్రదానం చేయనున్నారని పుత్తూరు డీవైఈవో రఘురామయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన జాతీయ అవార్డుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం శశికళ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంస్థ నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నమూనాల ఫొటోలను ఆ సంస్థ వెబ్ సైట్‌లో ప్రెజెంట్ చేశారని తెలిపారు. పర్యావరణం, ఎకో ఫ్రెండ్లీపై ఆరు అంశాల్లో పాఠశాల జాతీయ స్థాయిలో ఎంపికైందని తెలిపారు. పాఠశాల గ్రీన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్యామలత అవార్డును అందుకుంటారని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న 10 మంది బాలికలను, హెచ్‌ఎం శశికళ, శ్యామలను డీఈవో రఘురామయ్య, ఎంఈవో భారతి అభినందించారు.

ఐకాస జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



తిరుపతి అర్బన్: అమరావతి ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.సత్యనారాయణ ఎంపికయ్యారు. కర్నూలులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్ వేదికగా ఆదివారం ఏపీ అమరావతి ఐకాస 3వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా కమిటీని ఎంపిక చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన టి.సత్యనారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.15 లక్షల ఎర్రచందనం స్వాధీనం


సీజ్ చేసిన ఎర్రచందనం, వాహనం

కేవీబీపురం: మండలంలోని మార్పురెడ్డి కండ్రిగ వద్ద కారుసహా రూ.15 లక్షల విలువ చేసే 38 ఎర్రచందనం దుంగలను ఫారెస్ట్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పుత్తూరు రేంజర్ అశోక్‌కుమార్ యాదవ్ కథనం మేరకు.. మార్పురెడ్డి కండ్రిగ గ్రామం నుంచి ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆమార్గంలో మాటు వేశారు. అటుగా వస్తున్న ఇన్నోవా వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా డ్రైవర్ పారిపోయాడు. వాహనంలో 38 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. పుత్తూరు ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసి, వాహనం సహా ఎర్రచందనాన్ని సీజ్ చేశారు. ఈ దుంగల విలువ రూ.15 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పిచ్చాటూరు సెక్షన్ ఆఫీసర్ చైతన్య, సిబ్బంది సురేష్‌కుమార్, నీలకంఠ వాసు, భోగరాజు పాల్గొన్నారు. సిబ్బందిని రేంజర్ అభినందించారు.